# ఏఎఫ్ఎస్‌పిఏను పూర్తిగా రద్దుచేయాలి

**మనదేశం** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా చెప్పుకుంటోంది. అయితే, గత 7 దశాబ్దాలుగా మనదేశ పాలకులు నిరంకుశ తరహా సైనిక పాలనపై ఆధారపడి వున్నారు. కొన్ని రాష్ట్రాలలో తమ 'ప్రజాస్వామిక పాలన'ను కొనసాగించటానికి సైనిక బలగాల ప్రత్యేకాధికార చట్టాన్ని (ఏఎఫ్ఎస్‌పిఏ) ప్రయోగిస్తూ వస్తున్నారు. ఆయా రాష్ట్రాల ప్రజల ప్రజాస్వామిక వాంఛలను, ఆకాంక్షలను పరిష్కరించటానికి నిరాకరిస్తున్నారు.

ఏఎఫ్ఎస్‌పిఏ మూలాలు 1942లో బ్రిటిష్ వలసపాలకులు రూపొందించిన 'సైనిక బలగాల ప్రత్యేకాధికారాల చట్టం'లో ఉన్నాయి. 1942లో నాడు దేశంలో పెల్లుబికిన 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని అణచటం కోసం బ్రిటిష్ పాలకులు ఈ చట్టం ముందుకు తెచ్చారు.

అధికారమార్పిడి తదనంతరం భారత పాలకులకు ఈ చట్టం 'అనువు'గా తోడ్పడుతూ వుంది. ఐక్య అస్సామ్, నాగాలాండ్‌లో తొట్టతొలిగా 1958లో భారత పాలకులు, అక్కడి టెర్రరిజాన్ని ఎదుర్కొనే సాకుతో ఈ క్రూరచట్టాన్ని అక్కడ అమలుచేశారు. తదనంతరం ఈ చట్టాన్ని ఈశాన్య రాష్ట్రాలన్నింటికీ విస్తరించారు. 1998 తదనంతర కాలంలో ఈ నిరంకుశ చట్టాన్ని జమ్ము, కాశ్మీర్‌కు విస్తరించారు.

ఏఎఫ్ఎస్‌పిఏ ద్వారా సంక్రమించిన అపరిమిత అధికారాలతో చట్టభీతి లేకుండా ఆ రాష్ట్రాలలోని ప్రజల జీవితాలలో సైనిక బలగాలు భయోత్పాతాన్ని సృష్టిస్తున్నాయి. అనేక సందర్భాలలో ఈ అధికారాలు కూడా సరిపోక, ఈ చట్టాన్ని ఉల్లంఘించి మరీ అమాయక ప్రజలపైనేగాక, పౌర అధికారులకు వ్యతిరేకంగా కూడా నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాయి.

ఏఎఫ్ఎస్‌పిఏ అమలులో వున్న రాష్ట్రాలలోని ప్రజలు ఈ చట్టాన్ని నిరంతరాయంగా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. ఈ నిరంకుశ చట్టాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ చట్టాన్ని ఉపసంహరించు కోవాలనే ఏకైక డిమాండుతో మణిపూర్‌కు చెందిన ఇరోమ్ షర్మిల 16 సం॥లు నిరాహారదీక్ష చేపట్టింది. సైనిక బలగాలు తంగజం మనోరమను క్రూరంగా హత్యచేయటాన్ని నిరసిస్తూ, కొంతమంది మహిళలు సైనిక ప్రధాన కార్యాలయం వద్ద నగ్నంగా ప్రదర్శన జరిపి, సైనికుల క్రూరత్వాన్ని ప్రపంచానికి వెల్లడిచేశారు.

ఈనాడు సైనిక బలగాల చర్యలకు వ్యతిరేకంగా జమ్ము-కాశ్మీర్‌లో ప్రజల ప్రతిఘటన పెరుగుతూండటాన్ని మనం చూడవచ్చు. దేశంలో చొరబాటుదారులను ఎదుర్కొనే పేరుతో, టెర్రరిజాన్ని కట్టడిచేసే పేరుతో, భారతదేశాన్ని పెనుభద్రతా ముప్పు నుండి రక్షించేపేరిట, దేశ ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించేపేరిట ఈ రాష్ట్రంలో సైనిక బలగాలు చేస్తున్న అకృత్యాలు అన్నీ ఇన్నీ కావు. పౌరపాలనాధికారులను, రాష్ట్ర ప్రభుత్వాధికారులను పట్టించుకోకుండా సైనిక బలగాలు మొండిగా వ్యవహరిస్తూ సాగించే హింసాత్మక చర్యలకు జవాబుదారీతనం లేకుండా పోయింది.

ఏఎఫ్ఎస్‌పిఏ అమలు యొక్క న్యాయబద్ధత గురించి ఇప్పటికి అనేకమార్లు కేంద్ర ప్రభుత్వం నియమించిన అనేక కమిటీలు, కమిషన్లు విచారణ జరిపి, ఈ చట్టాన్ని రద్దుచేయాలని సిఫార్స్ చేశాయి కూడా. యుపిఏ ప్రభుత్వం సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ బి.పి. జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో నియమించిన కమిషన్ ఈ చట్టాన్ని పూర్తిగా తొలగించాలని సూచనలు చేసింది.

అయితే పాలకవర్గపార్టీలు ఈలాంటి సిఫార్సు లకు తలొగ్గవు. మానవహక్కుల ఉల్లంఘనలు వాటికి పట్టవు. అవి మానవహక్కులకు జవాబుదారీగా ఉండాలనే సిఫార్సులను పరిగణలోకి తీసుకోవు.

ఇటీవల బడ్జెట్ సెషన్ సమయంలో ఏఎఫ్ఎస్‌పిఏ విధింపుకు వ్యతిరేకంగా తీవ్ర వ్యతిరేకత ముందుకొచ్చి, ఆయా రాష్ట్రాలన్నీ దీనిని రద్దుచేయాలని డిమాండ్ చేయగా, యూనియన్ హోంశాఖా సహాయమంత్రి హమ్సరావ్ గంగారామ్ అహిర్ లోక్‌సభలో ఓ రాతపూర్వక సమాధానమిస్తూ తమ ప్రభుత్వం "మానవీయంగా మరింత ప్రభావ శీలంగా" ఈ చట్టాన్ని మలిచేందుకు ప్రతిపాదనలను పరిశీలిస్తోందని పేర్కొన్నాడు.

అయితే, తాజాగా కేంద్ర దేశీయాంగశాఖ, గత 27 సం॥లుగా ఏఎఫ్ఎస్‌పిఏ అమలవుతోన్న మేఘాలయలో ఏప్రిల్ 1 నుండి ఈ చట్టం అమలును నిలిపివేస్తున్నట్లుగా, అరుణాచల్‌ప్రదేశ్‌లోని 16 పోలీస్‌స్టేషన్లలో ఎనిమిది పోలీస్‌స్టేషన్ల పరిధిలో మాత్రమే ఈ చట్టాన్ని పరిమితం చేస్తున్నట్లుగా పేర్కొంది. మానవ, ప్రజాస్వామిక హక్కులను పరిరక్షించేవిధంగా ఎన్‌డిఏ పాలకులు 'మనసు మార్చుకున్నారని' ఈ ప్రకటనను ఎవరూ భావించాల్సిన అవసరంలేదు. అధికార కుటిల రాజకీయ క్రీడలో భాగంగానే ఈ చర్యలను ప్రకటించింది. ఏఎఫ్ఎస్‌పిఏ మానవీయంగా మారబోతోందని కూడా ఎవరూ భావించాల్సిన అవసరంలేదు. ఈ చర్య ప్రజాస్వామిక వాంఛలతో నున్న ప్రజానీకాన్ని మోసగించటానికి, వారి దృష్టిని అసలు విషయంపై నుండి మళ్ళించేందుకు మాత్రమే.

అయితే భారతదేశంలో సైనిక పాలనను కాక, నిజమైన ప్రజాస్వామిక పాలనను కోరుకునే ప్రజానీకం, ఏ ముసుగులోనైనా సైనిక పాలనను నిరాకరిస్తారు. ఏఎఫ్ఎస్‌పిఏను పూర్తిగా రద్దు చేయాలని, అది అమలులోనున్న రాష్ట్రాలలోని ప్రజల వాస్తవిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనికి మరో ప్రత్యామ్నాయ డిమాండ్ ఆమోదయోగ్యం కాదు.

oooo